రేపు యోగా దినోత్సవం

రామంతాపూర్ : పదవ ప్రపంచ యోగా దినోత్సవ వేడుకల్లో భాగంగా శుక్రవారం స్థానిక నెహ్రూనగర్ కమ్యూనిటీ హాల్‌లో యోగా అసోసియేషన్ ఆఫ్ ఇండియా చైతన్య యోగ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించే యోగ దినోత్సవానికి స్థానిక కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్‌రావుతో పాటు పలువురు యోగా గురువులు హాజరవుతారని యోగాచార్య రవీందర్ తెలిపారు. ఆసక్తి గలవారు 9246222889 సెల్ నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ఎమ్మెల్యే దృష్టికి స్థానిక సమస్యలు



ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డిని కలిసిన కార్పొరేటర్ మేకల సునీత రాముయాదవ్

గౌతంనగర్: ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. బుధవారం గౌతంనగర్ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీత రాముయాదవ్ ఆధ్వర్యంలో గౌతంనగర్‌కు చెందిన పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యేను ఆయన క్యాంపు కార్యాలయంలో కలిశారు. గౌతంనగర్ డివిజన్‌లో నెలకొన్న పలు సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ఎమ్మెల్యే జన్మదిన కేక్‌ను కట్ చేశారు.

బీజేపీ ప్రజల విశ్వాసాన్ని కోల్పోయింది



రాహుల్‌గాంధీ జన్మదినవేడుకల్లో పాల్గొన్న మైనంపల్లి

మల్కాజిగిరి: ఇండియా కూటమి తరుపున రాహుల్‌గాంధీ దేశానికి సేవలందించే రోజులు దగ్గరలోనే ఉన్నాయని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి అన్నారు. బుధవారం రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు మల్కాజిగిరి చౌరాస్తాలో ఘనంగా జరిగాయి. వేడుకల్లో పాల్గొన్న మైనంపల్లి మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందని, ఎన్‌డీఏ కూటమిలో ఉన్న పార్టీలు ఎప్పుడైనా మద్దతు ఉపసంహరించుకునే అవకాశముందన్నారు. పేద ప్రజలకు సేవలందించడానికి రాహుల్ గాంధీ ముందంజలో ఉంటాడన్నారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



మరమ్మతుల పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్

బోడుప్పల్: సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు 21వ డివిజన్ కార్పొరేటర్ భూక్యా సుమన్ నాయక్ అన్నారు. డివిజన్ పరిధిలో బుధవారం పర్యటించి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, వాటర్ మరమ్మతుల పనులను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు సిద్ధంగా ఉన్నానని, ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ సీనియర్ నాయకులు వెలుగొండయ్య, సూర్యప్రకాశ్‌రెడ్డి, కృష్ణమాచారి, బాలాజీ హిల్స్ ఫేస్ 3 కాలనీ అధ్యక్షులు నాగరాజ కుమార్ పాల్గొన్నారు.

ఏబీవీపీ కన్వీనర్‌గా అఖిల్



రామంతాపూర్ : ఉప్పల్ నియోజకవర్గ ఏబీవీపీ కన్వీనర్‌గా ఓల్డ్ రామంతాపూర్‌కు చెందిన బుర్ర అఖిల్ నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం ఏబీవీపీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జానారెడ్డి అఖిల్‌కు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అఖిల్ మాట్లాడుతూ నియోజకవర్గంలో అంకిత భావంతో చిత్తశుద్ధితో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు.

పాఠశాలల దుస్థితిపై మానవ హక్కుల సంఘానికి ఫిర్యాదు

మల్కాజిగిరి: ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న దుర్భర పరిస్థితులపై చర్యలు తీసుకోవాలని జాతీయ మానవ హక్కుల సంఘానికి ఫిర్యాదు చేశానని మల్కాజిగిరి డివిజన్ కార్పొరేటర్ శ్రవణ్ అన్నారు. పాఠశాలల్లో కనీస వసతులైన వాష్‌రూమ్స్, నాణ్యత లేని భోజనం పంపిణీతో పాటు పలు అంశాలను కమిషన్‌కు మెయిల్ ద్వారా పంపానన్నారు. గతంలో మంత్రులు,ఉన్నతాధికారులకు సైతం పలుమార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయిందన్నారు. జాతీయ కమిషన్ అధికారులతో ఫోన్‌ద్వారా మాట్లాడానని త్వరలోనే పరిశీలకులను పంపిస్తామని హామీ ఇచ్చారన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్

ఉప్పల్: అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలను పాటించాలని ఉప్పల్ డివిజన్ కార్పొరేటర్ మందుముల రజిత పరమేశ్వర్‌రెడ్డి అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా బుధవారం డివిజన్ పరిధిలోని వేంకటేశ్వర కాలనీలో రూ. 75 లక్షల అంచనా వ్యయంతో నిర్మించే సీసీ రోడ్డు పనులను కాలనీ వాసులు, జీహెచ్‌ఎంసి అధికారులతో కలిసి పరిశీలించారు.అనంతరం మాట్లాడుతూ కాలనీల్లో ముంపు సమస్య రాకుండా ఉండే విధంగా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు కె. సతీష్ గౌడ్, బజారు జగన్నాథ్, ఎస్ శ్రీనివాస్, లింగంపల్లి రామకృష్ణ, నల్ల ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గల్లీకో గంజాయి అడ్డా

• విస్తరిస్తున్న విష సంస్కృతి • నిలువరించలేక పోతున్న పోలీస్ యంత్రాంగం



ఉప్పల్: ఉప్పల్, దాని పరిసర ప్రాంతాల్లో నిత్యం యువత మత్తులో మునిగి తేలుతోంది. దమ్ మారో రోదం.. అంటూ మత్తులో మునిగి తెలుతున్నారు. మత్తులో మునిగి తేలే వారు ఎక్కువగా కళాశాల విద్యార్థులే కావడం ఆందోళన కలిగించే అంశం. చిన్న చిన్న ఏజ్ గ్రూపు పిల్లలు సైతం మత్తు బారిన పడి చిత్తవుతున్నారు. మాదక ద్రవ్యాల వినియోగం రోజు రోజుకూ పెరిగిపోతోంది. యువతే టార్గెట్‌గా గంజాయి సరఫరా జరుగుతోంది. ముఖ్యంగా డిగ్రీ, ఇంజనీరింగ్ విదార్థులే కాకుండా ఇంటర్ స్థాయి విద్యార్థులు కూడా మత్తు పదార్థాలకు బానిసవుతున్నారు. ఉప్పల్ ప్రాంతం అన్నింటికీ జంక్షన్ కావడంతో ఈ ప్రాంతంలో హాస్టల్స్ పుట్టగొడుగుల్లా విస్తరించాయి. దీనికి ముఖ్య కారణం ఘట్‌కేసర్ పరిసర ప్రాంతాల్లో పదుల సంఖ్యలో ఇంజనీరింగ్ కళాశాలు, ఉండటం వారంతా అక్కడ చదువుతూ ఇక్కడ హాస్టల్స్ లో ఉంటున్నారు. దీంతో వేలాది మంది యువతీ యువకులు ఉప్పల్ పరిసర ప్రాంతంలో ఉండటం వల్ల గంజాయి విక్రేతలు బాగా కలిసి వచ్చింది.

ఉప్పల్‌ను టార్గెట్ చేసుకున్నారు.

ఉప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలో నాలుగు డివిజన్లు ఉన్నాయి. ఉప్పల్, చిలుకానగర్, రామంతాపూర్, హబ్సిగూడ. హబ్సిగూడ కొంత భాగం ఓయూ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉంటుంది. చిలుకానగర్, మల్లికార్జున్ నగర్, ఎస్సీ కమ్యూనిటి హాల్ పక్కన గల నిర్జన ప్రాంతం, నాచారం చెరువు కట్ట, వెంకటరెడ్డినగర్, కేసీఆర్‌నగర్,కేటిఆర్ నగర్, మూసి పరివాహక ప్రాంతాలు, ఉప్పల్ దేవేందర్‌నగర్, లక్ష్మీనారాయణ కాలనీలు బస్తీలు కావడం, చుట్టూ పారిశ్రామిక వాడలు విస్తరించి ఉండటంతో మత్తు పదార్థాలు విక్రయానికి, సేవించడానికి అనుకూల ప్రాంతాలుగా మారాయి. వీటితో ఉప్పల్ ప్రాంతంలో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన భగాయత్ లే అవుట్‌లో కూడా ఇదే పరిస్థితి. ఎవ్వరైనా పోలీసులకు సమాచారం ఇచ్చినా, వారిని నిలువరించే ప్రయత్నం చేసినా వారిపై దాడులకు తెగపడుతున్నారు. పోలీసులు వచ్చే లోపుగా పరార్ అవుతున్నారు. దీంతో సమాచారం ఇవ్వడానికి స్థానికులు, ప్రత్యక్ష సాక్షులు జంకుతున్నారు. ఇక ఈ ప్రాంతాల్లో పార్టీలు, పండుగలు వస్తే గంజాయి మూకలు మరింత రెచ్చి పోతుంటాయి. పోలీసుల ఎదుటే దాడులకు పాల్పడిన సంఘటనలున్నాయి. అధికారులు అప్రమత్తమై సంఘ విద్రోహ శక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని, మత్తు పదార్థాల మూలాలను సమూలంగా నాశనం చేయాలని కోరుతున్నారు.

కఠినంగా వ్యవహరిస్తున్నాం

గంజాయి లాంటి మాదక ద్రవ్యాలను విక్రయించే వారిపై కఠినంగా వ్యవహరిస్తున్నాం. పోలీస్ స్టేషన్ పరిధిలో రాత్రి పూట పెట్రోలింగ్‌ను పెంచాం. సమస్య ఉన్న ప్రాంతాల్లో వాహనాల తనిఖీలను ముమ్మరం చేసాం. కళాశాలల్లో యాంటీ డ్రగ్ కమిటీలను ఏర్పాటు చేసి వారి ద్వారా విద్యార్థులను అప్రమత్తం చేస్తున్నాం. కాలనీల్లో, బస్తీల్లో అవగాహన సదస్సులను నిర్వహిస్తున్నాం. వీటితో కాలనీల్లో బస్తీల్లో కొత్త వారు కనిపిస్తే 100 కు డైల్ చేసి సమాచారం ఇవ్వాలి. విద్యార్థుల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి.

–మన్మధరావు, ఉప్పల్ ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్

మల్కాజిగిరి రైల్వే స్టేషన్‌లో డిజిటల్ గడియారం



గౌతంనగర్: మల్కాజిగిరి రైల్వే స్టేషన్‌లోని 3 నెంబర్ ఫ్లాట్‌ఫాంపై రైల్వే సీనియర్ డివిషనల్ సిగ్నల్ అండ్ టెలికాం అధికారులు డిజిటల్ గడియారాన్ని బుధవారం ఏర్పాటు చేశారు. కొంతకాలంగా రైల్వే స్టేషన్‌లో సమయపాలన తెలిపే గడియాకం లేకపోవడంతో ప్రయాణికుల సంఘం ప్రధాన కార్యదర్శి, డీఆర్‌యూసిని సభ్యులు నూర్ అహ్మద్ రైల్వే ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన అధికారులు బుధవారం స్టేషన్‌లో డిజిటల్ గడియారాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీనియర్ డివిషనల్ సిగ్నల్ అండ్ టెలికాం ఇంజనీరింగ్ పావని, మల్కాజిగిరి సీనియర్ సెక్షన్ ఇంజనీర్ (టెలికాం) నరసింహారావులకు ప్రయాణికుల సంఘం ప్రతినిధులు నూర్, ఏవి. స్వామిలు కృతజ్ఞతలు తెలిపారు.

23న ఉచిత వైద్య శిబిరం

మల్కాజిగిరి: ఆనంద్‌బాగ్‌లోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బిల్డింగ్ ఆవరణంలో 23 వ తేదీ ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నామని గణపతి మ్యూచ్‌వల్ ఎయిడెడ్ కోఆపరేటవ్ క్రెడిట్ సొసైటీ ప్రతినిధులు భరత్,మాధవరావులు తెలిపారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లా సహకారంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నామని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సీఎం ఫోటో ఏర్పాటు చేయాలి

కుషాయిగూడ: మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ డివిజన్ వార్డు కార్యాలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చిత్రపటాలను ఏర్పాటు చేయాలని కోరుతూ బుధవారం కాంగ్రెస్ పార్టీ డివిజన్ నేతలు వార్డు కార్యాలయ అధికారికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో డివిజన్ పార్టీ అధ్యక్షుడు పోలేపాక అంజయ్య, అంజిరెడ్డి, జలగం వెంకటేష్, శ్రీనివాస్, శ్రావణ్‌కుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాహుల్ పుట్టినరోజు వేడుకలు



హెచ్‌బీకాలనీలో రాహుల్ జన్మదిన వేడుకలు..



మల్లాపూర్‌లో...

కుషాయిగూడ: జాతీయ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు ఎంపీ రాహుల్‌గాంధీ పుట్టినరోజు వేడుకలను బుధవారం మీర్‌పేట్–హెచ్‌బీ కాలనీ డివిజన్‌లో ఘనంగ నిర్వహించారు. రాజీవ్‌పార్కు సర్కిల్‌లో పార్టీ శ్రేణులు కేక్ కట్ చేశారు. బావి భారత ప్రధాని రాహుల్ అంటూ నినదించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు పోలేపాక అంజయ్య, నాయకులు జలగం వెంకటేష్, ఎన్. శ్రీనివాస్, శ్రావణ్‌కుమార్‌గౌడ్, వెంకట్, దినేష్, మల్లికార్జున్, నవీన్, సునీతా, రోజా తదితరులు పాల్గొన్నారు.

చెట్టు కొమ్మలను తొలగించండి



వాణీనగర్‌లో రోడ్లపైనే చెట్ల కొమ్మలు ఇలా..

గౌతంనగర్: డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాలలో రోడ్లపై చెట్టు కొమ్మలు కుప్పలు తెప్పలుగా పేరుకుపోతున్నాయి. విద్యుత్ శాఖ సిబ్బంది ఇటీవల విద్యుత్ వైర్లకు ఆనుకొని ప్రమాదకరంగా ఉన్న చెట్ల కొమ్మలు నరికేశారు. నరికేసిన చెట్టుకొమ్ములు తొలగించకుండా రోడ్లపై వదలేయడంతో రోడ్డు పక్కన కుప్పటు తెప్పలుగా పేరుకుపోయి ఉంటున్నాయని పలువురు కాలనీల వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోజుల తరబడి చెట్టుకొమ్మలు తొలగించకపోవడంతో డ్రైనేజీ మ్యాన్ హోళ్ళలో ఇరుకొని ఉంటున్నాయని దానివల్ల డ్రైనేజీ నీరు పొంగి పొర్లుతు రోడ్డుపై కిలోమీటర్ల దూరం పారుతుందని వాణీనగర్‌కు చెందిన మాశెట్టి శ్రీనివాస్‌గుప్త తెలిపారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు స్పందించి రోడ్ల పక్కన పేరుకపోయి ఉన్న చెట్ల కొమ్మలను తొలగించాలని కోరుతున్నారు.


మేడ పైనుంచి దూకి వ్యక్తి ఆత్మహత్య

అల్వాల్: మద్యానికి బానిసై..మానసికస్థితి బాగాలేని వ్యక్తి ఇంటి మేడపై నుండి దూకి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన అల్వాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ మహేష్ తెలిపిన మేరకు.. మచ్చబొల్లారం బజార్‌కు చెందిన కృష్ణ సంజీవ్‌కుమార్ (46) ఫోటోగ్రాఫర్‌గా పనిచేస్తున్నాడు. ఇటీవల తన సోదరుడు మృతి చెందడంతో మద్యానికి బానిసయ్యాడు. దీంతో మద్యం మాన్పించడం కోసం రిహాబ్ సెంటర్‌లో కుటుంబసభ్యులు చేర్పించారు. మూడు నెలల చికిత్స అనంతరం ఈ నెల 17న ఇంటికి తీసుకురాగా మరుసటి రోజు చేతులు కడుక్కొని వస్తానని చెప్పి ఇంటి పైకి వెళ్లి కిందకు దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం సాయంత్రం మృతిచెందాడు. భార్య మాలతి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఉత్సాహంగా సాంస్కృతికోత్సవం


గౌతంనగర్: నగరంలోని తెలుగు వర్సిటీ ఆడిటోరియంలో బుధవారం సర్వకళ కళాకారుల సంక్షేమ వేదిక ఆధ్వర్యంలో సాంస్కృతికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన నాట్య గురువు, కళారత్న డాక్టర్ ఎస్‌పీ.భారతిని సభాధ్యక్షులు సారిపల్లి కొండల్‌రావు సత్కరించారు. అనంతరం సర్వకళ కళాకారుల సంక్షేమ వేదికకు ఎస్‌పి. భారతి ఆర్థిక సహాయం అందచేశారు.

కార్మికులకు అండగా ఎర్ర జెండా



ఉప్పల్: ఉప్పల్ ఆర్టీఏ కార్యాలయం పక్కన గల డంపింగ్ యార్డు వద్ద బుధవారం జీహెచ్‌ఎంసీ డంపింగ్ యార్డు చెత్త డంపింగ్ యార్డు డ్రైవర్స్ యూనియన్ , సీఐటీయూ ఆధ్వర్యంలో దిమ్మెను ఏర్పాటు చేశారు. మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు ఎ.ఆశోక్ హాజరై దిమ్మను ఆవిష్కరించారు.

ఎయిమ్స్ ఫర్ సేవా నిర్వాహకులు మృతి



అల్వాల్: అల్వాల్ సర్కిల్ మచ్చబొల్లారంలోని ఎయిమ్స్ ఫర్ సేవా నిర్వాహకులు బాలనర్సయ్య బుధవారం మృతిచెందారు. బాలనర్సయ్య ఎయిమ్స్ ఫర్ సేవా హాస్టల్‌ను నిర్వహిస్తూ ఎంతో మంది పేద విద్యార్థులకు అండగా ఉండి వారికి ఆశ్రయం కల్పించారు. ఎన్నో మందిని ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దారని స్థానికులు తెలిపారు.

ఉద్యోగులు అంకిత భావంతో పని చేయాలి



ఉద్యోగులతో చర్చిస్తున్న వెంకటేశ్వర్లు

బోడుప్పల్: ఆర్టీసి సంస్థ అభివృద్ధికి ప్రతి ఉద్యోగి అంకిత భావంతో పని చేయాలని ఆర్టీసీ గ్రేటర్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. చెంగిచర్ల ఆర్టీసీ డిపోను ఆయన సందర్శించి రూ 70లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బస్సుల పరిశుభ్రతను మెరుగు పర్చుకోవాలని, ఆర్టీసీ ఆదాయాలను పెంచుకునేందుకు ప్రత్యేక కార్యక్రమాలను చేపట్టి అమలు పరుస్తున్నట్లు వెల్లడించారు. ప్రతి డిపోలో రోజుకు రూ.లక్ష ఆదాయాన్ని పెంచుకునేందుకు లక్షే లక్ష్యం కార్యక్రమాన్ని చేపట్టి సాధిస్తున్నట్లు వెల్లడించారు. కార్య క్రమంలో డిపో మేనేజర్ కవిత, అసిస్టెంట్ మేనేజర్లు ఆనంద రావు, సుబ్రమణ్యం, డిప్యూటీ సూపరిండెంట్ పీకే సత్యన్, సినియర్ అసిస్టెంట్ కుబేరుడు పాల్గొన్నారు.

పాఠశాల మైదానంలో పార్కింగ్

మల్కాజిగిరి: తాళ్లబస్తీలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణ పార్కింగ్ స్థలంగా మారింది. విద్యార్థులు ఆడుకోవడానికి ఉన్న కొద్ది స్థలంలోనే ప్రైవేట్ వ్యక్తులు వారి వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. పాఠశాల ఆవరణంలో పార్కింగ్ చేసినా సంబంధిత పాఠశాల పర్యవేక్షకులు పట్టించుకోకపోవడం గమనార్హం.

విద్యార్థులకు సర్టిఫికెట్ల ప్రదానం


మేడ్చల్ రూరల్: విద్యార్థులు నూతన ఆవిష్కరణలను ఆవిష్కరించి సమాజానికి సహకాం అందించాలని మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి అన్నారు. మైసమ్మగూడలోని మల్లారెడ్డి మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం కేంబ్రిడ్జ్ ఇంగ్లీష్ ఎంపవర్ సీ1 లెవల్, సిస్కో సీ సర్టిఫికేషన్ అవార్డుల ప్రదానోత్సవం ఘనంగా నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు అవార్డులు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

పొంగిపొర్లుతున్న మురుగు



జల మండలి ఎండీకి వినతిపత్రం సమర్పిస్తున్న కార్పొరేటర్ శ్రీవాణి

రామంతాపూర్ : పలు కాలనీల్లో మురుగు రోడ్లపై పొంగిపొర్లుతుందని వెంటనే భూగర్భ డ్రైనేజీల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని బుధవారం కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకటరావు జల మండలి ఎండీ సుదర్శన్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. అందుకు జల మండలి ఎం.డి.సానుకూలంగా స్పందిస్తూ స్థానిక అధికారులుతో చర్చించి పనులు పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ సంఘం అధ్యక్షులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న అధికారులు

నిర్మాణ వ్యర్థాలు వేస్తే చర్యలు

ఉప్పల్: రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ నిర్మాణ వ్యర్థాలు వేస్తే భారీ జరిమానా విధిస్తామని ఉప్పల్ సర్కిల్ డిప్యూటి కమిషనర్ ఆంజనేయులు తెలిపారు. పట్టించిన వారికి నజరానా కూడా ఇస్తామన్నారు. డెబ్రిస్ వేసే వారిని పట్టిస్తే రూ.1000 వరకు నజరానాగా అందిస్తామని, నిర్మాణ వ్యర్థాలను పడేస్తే రూ. 50 వేల వరకు జరిమానాను విధించనున్నట్లు తెలిపారు. బుధవారం వివిధ ప్రభుత్వ విభాగాల అధికారులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా డీసీ మాట్లాడుతూ వేస్ట్ మెటీరియల్‌ను రోడ్ల పక్కన వేయడం వల్ల అనేక ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. ట్రాఫిక్ సమస్య ఉత్పన్న మవుతుందని, వీటితో పాటు పారిశుద్ధ్య సమస్య ఉత్పన్న మవుతుందన్నారు. నిర్మాణ వ్యర్థాలను రోడ్లపై వేస్తే మొదటి సారి గుర్తిస్తే రూ. 25 వేలు జరిమానా, రెండవ సారి పట్టు బడితే రూ. 50 వేల వరకు జరిమానా విధిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఈఈ నాగేందర్,ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకటరెడ్డి, టౌన్ ప్లానింగ్ ఏసీపీ వెంకటరమణ పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం



మల్కాజిగిరి: ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ వసంతపురి కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్ ప్రారంభించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ యూజీడీ, మంచినీటి పైపులైన్లు పూర్తయిన కాలనీల్లో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టుతున్నామని ఈ ప్రాంతంలో సుమారు 15 లక్షలు ఖర్చుచేస్తున్నామన్నారు. కార్యక్రమంలో డీఈలౌక్య, ఏఈ శ్రీకాంత్, విజ రజనీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

అర్ధంతరంగా ఆగిన పనులు..

పట్టించుకోని అధికారులు



సాయినగర్‌లో అధ్వాన్నంగా ఉన్న రోడ్లు



గౌతంనగర్: గౌతంనగర్ డివిజన్ పరిధిలోని సాయినగర్ కాలనీ, సాయిబాబా ఆలయం వద్ద ఉన్న రోడ్డు నిర్మాణ పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. సాయినగర్ కాలనీలో మురుగు సమస్య పరిష్కరించడానికి గత కొన్ని నెలల క్రితం సుమారు రూ. 41 లక్షల వ్యయంతో సాయినగర్‌లో ఉన్న నాలుగు రోడ్లు, భూగర్భ డ్రైనేజీ నిర్మాణ పనులకు అధికారులు ప్రారంభించారు. నెలలు కావస్తున్నా భూగర్భ డ్రైనేజీ, రోడ్డు నిర్మాణ పనులు పూర్తి కాలేదని కాలనీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సాయినగర్ కాలనీలో భక్తుల కొంగు బంగారం సాయినాథుడి ఆలయం ఉండడంతో మల్కాజిగిరి చుట్టుపక్కల ప్రాంతాలతోపాటు ఇతర ప్రాంతాల నుండి గురువారంతోపాటు ప్రతిరోజు వందలాది భక్తులు వస్తుంటారు. రోడ్డు నిర్మాణ పనులు జరుగకపోవడం వల్ల ఆలయానికి వచ్చే భక్తులతోపాటు కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పలువురు పేర్కొన్నారు. సంబంధిత కాంట్రాక్టరుకు బిల్లులు మంజూరు కాలేదని రోడ్డు నిర్మాణ పనులు ఆపారని పలువురు తెలిపారు.

మురుగునీటి పైపులైన్‌లు మార్చడానికి..

సాయినగర్ కాలనీ వాసులు ఎగువ ప్రాంతమైన గౌతంనగర్, మల్లికార్జునగర్, రైల్వే ఖాళీ స్థలం, దయానంద్‌నగర్ తదితర ప్రాంతాల నుండి ప్రతి ఏటా వర్షాకాలంలో వచ్చే వరద నీటితో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాలనీ వాసుల ఇబ్బందులు తొలగించేందుకు కాలనీలో ఉన్న ఒక అడుగు పైప్ లైన్ స్థానంలో రెండు అడుగుల పైప్‌లైన్ ఏర్పాటుకు తవ్వకాలు జరిపారు. సగం పనులు పూర్తి చేసిన సంబంధిత కాంట్రాక్టర్లు జీహెచ్‌ఎంసి నుండి బిల్లుల రూపంలో సకాలంలో నిధులు మంజూరు కావడం లేదని మధ్యలోనే పనులు ఆపివేశారు. ఈ క్రమంలో గుంతల రోడ్లుతోపాటు మ్యాన్ హోళ్లు కుంగి స్థానికులు, ఆలయానికి వచ్చే భక్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

త్వరలో పనులు పూర్తి చేస్తాం

సాయినగర్‌లో పెండింగ్‌లో ఉన్న రోడ్డు నిర్మాణ పనులు త్వరలో పూర్తి చేస్తాం. ఇటీవలే కాలనీలో పర్యటించాం. ప్రస్తుతం భూగర్భ డ్రైనేజీ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. ఆ పనులు పూర్తి అయిన తరువాత రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించి త్వరలో పూర్తి చేస్తాం. –ఏఈ. దివ్యజ్యోతి